# మానవ హక్కులు - 1999

## బులెటిన్ నెం. 1 ఆవిష్కరణ సభ

అన్యాయం జరిగిందంటూ ఒకటికి పదిసార్లు అరిచినంత మాత్రాన ప్రజలు స్పందించి వెంటవచ్చే రోజులు కావివి.

కొంత ఉద్యమాలవల్ల, కొంత ఇతర కారణాలవల్ల ప్రజల వివేచన శక్తి పెరిగింది.

ఈ రోజు వారికి సమస్యల గురించి, వాటి పరిష్కారానికి తోడ్పడగల కృషి గురించి వివరమైన విశ్లేషణ కావాలి. కప్పదాట్లు వేయకుండ అన్ని అనుమానాలకూ సందేహాలకూ జవాబు చెప్పే వివరణ కావాలి.

అదీ మంచిదే. వచ్చే మార్పులు కొంత నిలకడగా ఉంటాయి. ఉద్యమ సాహిత్యానికి కొంత పస ఉంటుంది.

మానవ హక్కుల వేదిక ఏర్పడి ఒక సంవత్సరం గడిచిన సందర్భంగా మా అవగాహననూ ఆచరణనూ వివరించే మొదటి బులెటిన్‌ను తీసుకొస్తున్నాము.

అందులో మేము చెప్పదలచుకున్న అన్ని విషయాలూ చెప్పేయలేదు. చెప్పేయడానికి 'అన్ని విషయాలూ' మా ఆలోచనలోకీ అనుభవంలోకీ ఇంకా రాలేదు.

వచ్చిన విషయాలన్నీ కూడ మొదటి బులెటిన్‌లో ప్రస్తావనకు రాలేదు. హక్కుల కార్య రంగానికి ఉండే విస్తృతిని కనీసం సూచనప్రాయంగా తెలియజేసే విషయాలను, ఈ సంవత్సర కాలంలో మేము కొంత కృషి చేసిన విషయాలను, మేము విశ్లేషించి ఏదైనా సందేశం ఇయ్యగల విషయాలనూ దృష్టిలో పెట్టుకొని ఈ బులెటిన్ రూపొందించాము. ఇతర విషయాలు ఇకపైన రాబోయే ప్రచురణలలో ప్రస్తావిస్తాము.

హక్కుల గురించి, హక్కుల సిద్ధాంతాన్ని గురించి విస్తృతంగా చర్చ జరగడం, లోతయిన అవగాహన పెరగడం అవసరం అని మేము భావిస్తున్నాము. ఎక్కువ భాగం నిరక్షరాస్యులయిన ఈ దేశంలో అది ప్రధానంగా బహిరంగ సభల ద్వారా, నోటిమాటగా సందేశాన్ని అందించే ఇతర ప్రచార కార్యక్రమాల ద్వారా జరుగుతుంది. కానీ లోతయిన విశ్లేషణకు లిఖిత ప్రచురణలు అవసరం. ఉపన్యాసాలకు అందని సందేహాలకూ సంశయాలకూ జవాబు చెప్పడానికి తార్కికంగా సమగ్రమైన విశ్లేషణ అవసరం. అందువల్ల వివేచనాత్మకమైన ప్రచురణలు (కరపత్రాలు, పుస్తకాలు) తీసుకు రావడం ఒక ముఖ్య కర్తవ్యంగా మేము పెట్టుకున్నాము.

హక్కుల ఉద్యమం తనదంటూ ఒక గుర్తింపుకు, ఒక అవగాహనను, ఒక కార్యరంగాన్ని రూపొందించుకుంటున్న తరుణంలో మానవ హక్కుల వేదిక ఏర్పడింది. ఇంకా చెప్పాలంటే ఆ క్రమంలో ఏర్పడింది. ఈ ప్రయత్నం దేనినో కాదంటున్నదన్న సందేహాలను అధిగమించి తన గమనాన్ని చేరుకునే ప్రయత్నంలో ఉంది.

బలమైన హక్కుల ఉద్యమం ఆవశ్యకత ఎంత ఉందో, తన పాత్ర ఏమిటో దానికి తగిన దృక్కోణం ఏమిటో కచ్చితంగా గుర్తించగల హక్కుల ఉద్యమం ఆవశ్యకత కూడ అంత ఉంది.

ఈ ఆవశ్యకతకుండే అన్ని కోణాలనూ వివరించడం హక్కుల ఉద్యమం అజెండాను ఏకరవు పెట్టడం అవుతుంది. అయితే ఆ అజెండాలోని అన్ని అంశాలకూ ఒక కొత్త 'అర్జెన్సీ' చేర్చిన రెండు బలమైన పరిణామాల మధ్య ఈ ప్రయత్నం జరుగుతున్నది.

ఒకటి, భారతదేశంలో హిందుత్వ వాదుల సామాజిక రాజకీయ ఆధిక్యత. ఇది అన్ని జీవితరంగాలలోనూ ప్రజాస్వామ్యానికి ప్రమాదకారి. కేవలం ముస్లింలకూ, క్రైస్తవులకూ కాదు.

రెండు, ప్రజల జీవితాన్ని కఠినతరం చేస్తున్న 'సరళీకృత' ఆర్థిక విధానాలు, ప్రజల జీవన అవకాశాలను కుదించి ఆకలి, నిరుద్యోగం, అణచివేతల బందిఖానాలో వారి ఆకాంక్షలను బంధిస్తున్న ప్రపంచీకరణ విధానాలు. ఆ వెలుగులో రూపొందించిన చంద్రబాబు 'విజన్'.

ఇవి వాటంతటవి హక్కుల అతిక్రమణకు దారితీయడమేకాక కులం, జెండర్, వనరుల లేమి, పేదరికం, రాజ్యహింస మొదలయిన అన్ని రూపాలలోనూ హక్కుల లేమినీ అణచివేతనూ పెంచే పరిణామాలు. ప్రజా ఉద్యమాల ఆవశ్యకతనూ ప్రజాతంత్ర కృషి అవసరాన్నీ ఎంతగా పెంచుతాయో అంత కష్టతరం చేసే పరిణామాలు.

**మానవ హక్కుల వేదిక**
**Human Rights Forum**

## బహిరంగ సభ

**28 నవంబర్ 1999, ఆదివారం, సాయంత్రం 6.00 గం॥**

బులెటిన్ ఆవిష్కరణ : **జాహిద్ అలీఖాన్**
సంపాదకులు, 'సియాసత్' దినపత్రిక

అధ్యక్షత : **ఎస్. జీవన్‌కుమార్**

పరిచయం : **ఎం. కోదండ రామిరెడ్డి**

వక్తలు : **బుర్ర రాములు** (వరంగల్)
**బి. చంద్రశేఖర్** (గుంటూరు)
**పి. సుధాకర్** (అనంతపురం)

స్థలం : ప్రెస్ క్లబ్, బషీర్‌బాగ్